క్లుప్తంగా

గ్రంథాలయానికి స్థలం కేటాయింపు



స్థల పత్రాలను సభ్యులకు అందజేస్తున్న ఈఓపీఆర్డీ

కొత్తూరు: గ్రంథాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన యూత్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్‌కు ఇటీవల దరఖాస్తు చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందించారు. స్థలం కేటాయించాలని ఈఓపీఆర్డీ బసవ రాంబాబుకు సూచించారు. ఈ మేరకు మెట్టూరు బిట్–2 ఆర్‌ఆర్ కాలనీలోని సర్వే నంబర్ 334–2లో 8 సెంట్లను కేటాయించారు. స్థలానికి సంబంధించిన పత్రాలను అసోసియేషన్ సభ్యులకు ఈఓపీఆర్డీ మంగళవారం అప్పగించారు. స్థలం కేటాయించడానికి కృషి చేసిన నాయకులకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ



నౌతళలో విచారణ చేస్తున్న ఉపాధి హామీ అధికారులు

సారవకోట: మండలంలోని నౌతళ, గొర్రిబంద ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఉపాధి ఏపీడీ మురళీకృష్ణ విచారణ చేపట్టారు. నౌతళ పంచాయతీలో మే, జూన్ నెలల్లో ఉపాధి పనికి రాకుండా వేతనదారుల పేర్లు రాసుకుని వేతనాలు తీసుకున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. గొర్రిబంద పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో పనులకు రాకుండా పేర్లు రాసుకున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు ఏపీఓ నారాయణరావు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

కట్టిజనుముతో నేలకు సారం



కట్టి జనుము సాగును పరిశీలిస్తున్న ఏఓ

సారవకోట: కట్టిజనుము పంటతో నేలకు సారం కలుగుతుందని వ్యవసాయాధికారి వెంకటరావు అన్నారు. మండలంలోని వడ్డినవలస గ్రామానికి చెందిన రైతు ఇప్పిలి రామ్మోహనరావు పొలంలో కట్టి జనుము సాగును మంగళవారం పరిశీలించారు. వరి నాట్లు వేసుకునే ముందు కట్టి జనుము పంట సాగు చేస్తే భూసారం పెరిగి పంటకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.

పంట పొలాల పరిశీలన



పెనుబర్తిలో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పొందూరు: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి, మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, అధికారులు మంగళవారం పరిశీలించారు. పెనుబర్తి, లక్ష్మీపేట, తాడివలస గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. పంట నష్ట అంచనాలను గుర్తిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు, డీఆర్‌సీ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరావు, ఎంఏఓలు ప్రియాంక, బెండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్‌పై ఆందోళన చెందొద్దు

- పశుసంవర్ధక శాఖ డీడీ రాజగోపాలరావు



వాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీడీ రాజగోపాలరావు

కొత్తూరు: పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధిపై పాడి రైతులు ఆందోళన చెందవద్దు అని పశుసంవర్ధక శాఖ డీడీ గోపాలరావు తెలిపారు. మండలంలోని ఆకులతంపర గ్రామంలో మంగళవారం పశువులకు వేస్తున్న లంపీ స్కిన్ వాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. లంపీ స్కిన్ వాక్సిన్లు జిల్లాకు 1,43,800 మంజూరైయ్యాయన్నారు. ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా 26,536 వాక్సిన్లు వేశామన్నారు. కొత్తూరు మండల పశు వైద్యాధికారి హరికృష్ణ, సర్పంచ్ నాగళ్ల అప్పన్న, ఏడీ నారాయణరావు, ఐసీడీపీ ఏడీ బి.నాగేశ్వరరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వరద కష్టాలు



శాస్త్రులపేట కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

- ముంపుబారిన పంటలు
- శాశ్వత పరిష్కారం కరువు

నియోజకవర్గంలోని కాజ్‌వేల వివరాలు	
మండలం	కాజ్‌వేలు
సరుబుజ్జిలి	4
బూర్జ	2
ఆమదాలవలస	3
పొందూరు	3

సరుబుజ్జిలి: వర్షా కాలంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర సమయంలో అవస్థలు పడాల్సిన పరిస్థితి. ఆర్‌అండ్‌బీ రహదారులపై ఏర్పాటు చేసిన కాజ్‌వేల (డ్రిప్పులు) వద్ద వర్షాలు, వరదల సమయంలో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాజ్‌వేలపై ప్రవహించిన వరదనీరు వల్ల వందలాది ఎకరాల పంట భూములు నాశనమవుతున్నాయి. నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని ఆర్‌అండ్‌బీ రహదారులపై 12 చోట్ల డ్రిప్పులున్నాయి.

కదలని వరద నీరు..

ఆర్‌అండ్‌బీ రహదారిలో నిర్మించిన కాజ్‌వేల వల్ల ప్రతి ఏటా వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీరు వాటిగుండా ప్రవహించడం వల్ల దిగువన ఉన్న ఆయకట్టు భూములు ముంపు బారి నపడుతున్నాయి. కాజ్‌వేలు సరైన ఎత్తులో నిర్మించపోవడం వల్ల రోజుల తరబడి నీరు ప్రవహిస్తుంది. పంట నష్టం ఏర్పడుతుంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రాకపోకలు బంద్..

సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం, శాస్త్రులపేట, కేజేపేట వద్ద గల ఆర్‌అండ్‌బీ రహదారులపై కాజ్‌వేలు ఏర్పాటు చేశారు. వరదలు వచ్చే సమయంలో కాజ్‌వేల పైనుంచి వారం రోజులు పాటు నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల పురుషోత్తపురం, పాలవలస, రావివలస, అగ్రహారం, యరగాం, పెదమాలపేట, పురుషోత్తపురం తదితర గ్రామాల వాసులకు మండల కేంద్రంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి.

ఎత్తు పెంచాలి



డ్రిప్పులు వద్ద ఎత్తును పెంచి పైపులు, షట్టర్లు ఏర్పాటు చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల అధికంగా నీరు ప్రవహించే సమయంలో కిందికి విడిచిపెట్టి, అవసరం లేనప్పుడు నిల్వ చేయవచ్చు. పంట పొలాలకు ఇబ్బంది ఉండదు. అధికారులు పరిష్కారం చూపాలి.

– పి.తవిటినాయుడు, మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

వరదలు వస్తే ఇబ్బందే



వరదలు వచ్చే సమయంలో రెండు, మూడు రోజులు పాటు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. అత్యవసరమైనా ఇబ్బందులు పడాల్సిందే తప్ప ఎటువంటి మార్గంలేదు. కాజ్‌వేలు వద్ద నూతన్ డిజైన్‌తో నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలి.

– ఇల్లాకుల శ్రీనివాసరావు, నందికొండ కాలనీ, సరుబుజ్జిలి మండలం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

లోతట్టుగా నిర్మించిన కాజ్‌వేల విషయంలో పునఃపరిశీలన చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కొన్నిచోట్ల ఎత్తు పెంచి వరద కష్టాలు లేకుండా చేస్తాం.

– ఎం.ఎం.నాయక్, జేఈ, ఆర్‌అండ్‌బీ, సరుబుజ్జిలి

సాగుకు అవకాశం కల్పించండి



ఆదివాసీలతో మాట్లాడుతున్న పోలీసులు

జలుమూరు: తాము కొనుగోలు చేసిన భూములను సాగు చేస్తుంటే.. ఆ భూమి తమదంటూ ఎస్టీ మాకివలస గ్రామస్తులు అడ్డుకున్నారని ఇస్కాన్ సంస్థ (నందగోపాల్ ట్రస్ట్) సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఊణ్న సూర్యనారాయణ వద్ద నుంచి 12 ఎకరాలు, మరో ఎనిమిది ఎకరాలు గిఫ్ట్ కింద కొనుగోలు చేశామన్నారు. పోలీసులు గ్రామానికి వెళ్లి భూములను పరిశీలించారు. తాము గత కొంతకాలంగా సాగుచేస్తున్న భూములను కొందరు పెత్తందారుల ఆక్రమించి విక్రయించారని సుమారు 35 ఆదివాసీ కుటుంబాలవారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇస్కాన్ సభ్యులతోపాటు, ఊణ్న సూర్యనారాయణ తమకు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఈ సమస్య శ్రీకాకుళం ఆర్డీఓ దృష్టిలో ఉందని ఆదివాసీ సంక్షేమ సంఘం పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు అన్నారు. ఆర్డీఓ రంగయ్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టిలో కూడా ఈ సమస్య ఉందన్నారు. పోలీస్‌లు గ్రామంలోకి వచ్చి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంటని ప్రశ్నించారు. దీనిపై నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ ఆ భూములు కొనుగోలు చేసినట్లు రికార్డులు ప్రకారం ఉందన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు సాగు చేస్తుంటే ఆదివాసీలు అడ్డుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నత ఆశయాలను ఏర్పర్చుకోవాలి

ఆమదాలవలస: ప్రతి విద్యార్థి ఉన్న ఆశయాలను ఏర్పర్చుకోవలని ఎంఈఓ జి.రాజేంద్రప్రసాద్ సూచిచారు. పట్టణంలోని సిద్ధార్థ ఐటీఐలో 2022–24 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను చదివించి ప్రయోజకులను చేసేందుకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కరస్పాండెంట్ మొదలవలస రమేష్, వెంకటేశ్వర ఐటీఐ కరస్పాండెంట్ కూన భానోజీరావు, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మెళియాపుట్టి: పనిచేసే చోట మహిళలపై వేధింపులను నిరోధించే చట్టంపై ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం సీడీపీఓ విమలారాణి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో పలువురు మహిళలకు 2013 మహిళల వేధింపుల వ్యతిరేక చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఉద్దేశపూర్వకంగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధింపులకు గురైతే ఏం చేయాలనే దానిపై వివరించారు. దీనికి సంబంధించి కమిటీలు సైతం వేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ భాస్కరరావు, ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు, మండల పరిపాలనా అధికారి తిరుపతి పట్నాయక్, ఏపీఎం లలిత, ఏపీఓ రవి తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ

హిరమండలం: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమల కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సుధాకర్, పోలీస్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ సేవే ధ్యేయం

- రోటరీ జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న తేజలక్ష్మి

ఆమదాలవలస: సమాజ సేవే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం ఆమదాలవలస రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. సమాజం అభివృద్ధి చెందాలనే ఆలోచనతో రోటరీ క్లబ్ మెంబర్లు పనిచేయాలని సూచించారు. నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన అంధురాలు పి.తేజలక్ష్మి మాట్లాడుతూ ఆమదాలవలసలో రోటరీ క్లబ్ భవన నిర్మాణానికి జిల్లా గవర్నర్ సహకరించాలని కోరారు. దీనికి కావాల్సిన స్థలం ఆమదాలవలసలో ఇప్పటికే రొటేరియన్స్ సమకూర్చారన్నారు. ఆ స్థలానికి రూ.5 లక్షలు ఖర్చుచేసి కాంపౌండ్ వాల్ నిర్మిస్తానని రొటేరియన్, రోటరీ క్లబ్ పూర్వ కార్యదర్శి బుడుమూరు శ్రీనివాసరావు ప్రకటించారు. ఆయనకు సభ్యులందరూ అభినందించారు. దీనిపై స్పందించిన జిల్లా గవర్నర్ రోటరీ క్లబ్ భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యదర్శి జె.రవిబాబు, పూర్వ అధ్యక్షులు సంజీవరావు, పూర్వ కార్యాదర్శి బి.శ్రీనివాసరావు, విశిష్ట అతిథి జిల్లా అసిస్టెంట్ గవర్నర్ రజనీకాంత్, రొటేరియన్స్ పాత్రుని పాపారావు, జె.కె.వెంకటేశ్వరరావు, కె.హరిప్రసాద్, టి.మధన్‌కుమార్, పేడాడ వెంకట ప్రతాప్‌కుమార్, శిల్లా రవికుమార్, సనపల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి



నరసన్నపేట: జెడ్పీ ఉన్నత పాఠశాల(బోర్డు)లో ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నరసన్నపేట: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్కూళ్లలో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ సౌకర్యం నిమిత్తం ఏర్పాటు చేస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. స్థానిక బోర్డు స్కూల్లో మంగళవారం ఆధార్ శిబిరాన్ని ప్రారంభించారు. మడపాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాడాం, బోర్డు ఉన్నత పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించామన్నారు. వీటిల్లో 110 మందికి ఆధార్ అప్‌డేట్ చేశామన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు ఉంటాయన్నారు.

సారవకోట: మండలంలో అవలింగి, గుమ్మపాడు, చిన్నగుజ్జువాడ, మాళువ తదితర సచివాలయాలలో ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆధార్ కార్డులు లేని పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో ఆధార్ నమోదు చేయించారు.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1, కడుము గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీఓ త్రివిక్రమరావు పరిశీలించారు. ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 45 మందికి ఆధార్ సేవలు అందించినట్లు సచివాలయ కార్యదర్శి గురుగుబెల్లి రాము తెలిపారు.

రైతులను ఆదుకోవాలి



ముంపు పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సరుబుజ్జిలి: వర్షాలు, వరదల ప్రభావంతో ముంపు బారినపడి నష్టపోయిన పంట పొలాల రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, వెలమల రమణారావు డిమాండ్ చేశారు. ముంపుబారిన పడిన ఇస్కలపాలెం, వీరభద్రాపురం, లొద్దలపేట పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. కౌలు రైతు సంఘం నాయకులు ధనుజంయ నాయుడు, తులగాపు భాస్కరరావు, సీఐటీయూ నాయకుడు రామస్వామి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

నరసన్నపేట: బడిఈడు విద్యార్థులు విధిగా పాఠశాలల్లోనే ఉండాలని ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు సూచించారు. సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో డ్రాపౌట్స్ సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సచివాలయం పరిధిలో విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, ఏయే పాఠశాలల్లో చదువుతున్నారనే వివరాలతో పాటు వారి ఆధార్, ఫోను నంబర్లు కూడా సేకరించాలన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రాల పరిశీలన



చిరుధాన్యాల యంత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని ఇల్లాయిపురం, పెద్దమడి, నేలబొంతు, మెళియాపుట్టి గ్రామాల్లో ఇదివరకే కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన వన్‌ధన్ వికాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ మనోరత్నం అన్నారు. స్థానిక ఏపీఎం లలితతో కలిసి ఆయా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్, అగరబత్తీల తయారీ, చిరుధాన్యాలు తదితర యంత్రాల పనితీరు తెలుసుకున్నారు. ఏవిధంగా ఆర్థికపరమైన లబ్ధి పొందుతున్నారో ఆరా తీశారు. వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా లబ్ధిదారుల ఆర్థిక పురోభివృద్ధి పెరగాలని సూచించారు. పలువురు సీసీలు, సీఎఫ్‌లు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వంశధార ప్రాజెక్ట్ సందర్శన



ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించిన విద్యార్థులతో అధికారులు

ఆమదాలవలస: తొగరాంలో గల ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంగళవారం ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నేరడి, హిరమండలం వంశధార ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సీతారాములు తెలిపారు. ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. వంశధార డీఈఈలు గాయత్రీ, చంద్ర కుమార్, భవానీ శంకర్, ఏఈఈలు జగదీష్ బాబు, సాయి దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలపై పోరాటాలకు సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అరాచక, రాక్షస పాలన కొనసాగుతుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీటిపై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 50 రోజుల పాలనలో హత్యలు, లైంగిక వేధింపులు పెరిగిపోయాయన్నారు. 36 మంది అమాయకుల ప్రాణాలు తీశారన్నారు. వైఎస్సార్ సీపీకి 40 శాతం మంది ఓట్లు ఎలా వేశారని, వారంతా అన్నం తింటున్నారా? అని అసెంబ్లీ సాక్షిగా బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఓటర్లని చులకగా మాట్లాడటాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యా రాజకీయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

స్వయం శక్తి సంఘాలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

జలుమూరు: స్వయం శక్తి సంఘాలు బలోపేతానికి ప్రతి నెలా కచ్చితంగా సమీక్ష నిర్వహించాలని, చిన్న సంఘాలన్నీ గ్రేడ్–ఏలోకి వచ్చేందుకు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జలుమూరు వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వయం శక్తి సంఘాల సభ్యులు పొదుపు నిధులు, స్త్రీనిధి రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో 10 మంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, అందుకు డీఆర్‌డీఏ అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. దీని కోసం ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, తదితర సబ్సిడీ రుణాలు ఉపయోగించుకోవాలన్నారు. చేయూత, నాలుగో విడత నిధులు లబ్ధిదారులందరికీ ప్రభుత్వ నిర్ణయం మేరకు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఏపీ కె.కొండలరావు, అధ్యక్షురాలు కొత్తమ్మ, స్త్రీనిధి మేనేజర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్‌ఐ అసిరినాయుడు

నరసన్నపేట: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక మంగళవారం నిర్వహించారు. దీంట్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఏఎస్‌ఐ అసిరినాయుడు విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ నాయకత్వ ప్రాముఖ్యతను, లక్షణాలను వివరించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. 16 మందికి వివిధ నాయకత్వ బాధ్యతలను అప్పగించామని కళాశాల ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



సరుబుజ్జిలి: మొక్కలు నాటుతున్న డీవీఈఓ తవిటినాయుడు



కొత్తూరు: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సరుబుజ్జిలి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీతాఫలం మొక్కలు నాటారు. భావితరాల అవసరాలకు మొక్కలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం తూతిక సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మొక్కలు నాటాలన్న సామాజిక స్పృహ రావడం ఆనందించదగిన విషయమన్నారు. మొక్కలు నాటిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సూచనలిస్తున్న శాస్త్రవేత్త హరికుమార్

ఆమదాలవలస: ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉద్యానవన పంటల్లో చేపట్టవల్సిన సస్య రక్షణ చర్యలు గురించి ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ మంగళవారం రైతులకు సూచనలు ఇచ్చారు. అరటి తోటలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు వెళ్లేలా చేయాలి. ఒక్కో చెట్టుకు 100 గ్రాములు యూరియా, 80 గ్రాముల పొటాష్ ఎరువులను వేయాలి. సిగటోక ఆకు మచ్చ తెగులను అరికట్టేందుకు ప్రొపికోనాజోల్ ఒక మిల్లీ లీటర్, మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి, రెండు సార్లు పిచికారీ చేయాలి. బొప్పాయి మొక్క మొదళ్ల వద్ద నీటిని తీసివేయాలి. రెండు రోజులు వరకు నీరు నిలబడిన తోటలలో ఆకులు పసుపు రంగుకు మారుతున్నట్లయితే మెటవాక్జిల్ ఎం.జెడ్ మూడు గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కూరగాయల నారుమడులలో నీరు నిల్వ ఉంటే వేరు కుళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నీటిని బయటకు పంపించి మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి నారుమడులపై, మొక్కల మొదల వద్ద పోయాలని తెలిపారు.

పాతపట్నం అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వరి పంటకు సాగునీరు అందించేలా వంశధార, మహేంద్ర తనయ నదులపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరారు. గిరిజన గ్రామాలతో పాటు అనేక గ్రామాల్లో రోడ్లు మెరుగుపర్చేందుకు నిధులు ఇవ్వాలని విన్నవించారు.